# యువ ఓటర్లపై స్పెషల్ ఫోకస్

- బస్తీలు, కాలనీలు, బూత్‌ల వారీగా వివరాలు సేకరిస్తున్న పార్టీలు
- యువకులను మొబిలైజ్ చేసేందుకు స్థానిక లీడర్ల ప్లానింగ్



సిటీబ్యూరో, నవంబర్ 11(నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. ప్రస్తుతం అన్ని పార్టీలు ప్రచారంపై దృష్టి పెట్టి ఓటర్లను ఆకట్టుకునే పనిలో ఉన్నాయి. పార్టీలకు అతీతంగా వర్గాలు, జెండర్, వయసుల వారీగా ఓటర్లను ఆకట్టుకునేలా ప్రణాళికలు చేస్తున్నాయి. అయితే ఈసారి గ్రేటర్ వ్యాప్తంగా భారీగా ఉన్న 30ఏళ్ల లోపు ఉన్న ఓటర్లను తమ వైపు తిప్పుకోవడమే లక్ష్యంగా వేగంగా ఆయా పార్టీల నాయకులు అడుగులు వేస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లోని అన్ని నియోజకవర్గాల్లో యువతీయువకులు గణనీయంగా పెరగడంతో పార్టీలన్నీ ఈ వర్గం ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డాయి.

కోటిన్నర జనాభా ఉన్న నగరంలో సగానికి పైగా 35ఏళ్ల లోపే జనాభా ఉంటుంది. ముఖ్యంగా 18ఏళ్ల నుంచి యుక్త వయసు కలిగిన ఓటర్ల సంఖ్య అత్యధికంగా ఉంది. ఈ వర్గంలో ఉన్న ఓటర్లే పార్టీలకు ఇప్పుడు కల్పవృక్షంలా మారుతున్నాయి. పార్టీలు నడి వయసు ఓటర్ల కంటే యువ ఓటర్లను దారిలోకి తెచ్చుకునే పనిలో పడ్డాయి. ఇప్పటికే గ్రేటర్‌లోని అన్ని నియోజకవర్గాల్లో బూత్ కమిటీలు, వార్డు కమిటీలు, డివిజన్, కాలనీ, బస్తీ కమిటీలను ఏర్పాటు చేసి తమ వైపునకు తిప్పుకునే యోచనలో ఉండగా.. ఇప్పుడు దశల వారీగా ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని విస్తరించే పనిలో ఉన్నారు.

ఈ క్రమంలో వృత్తుల పరంగా ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసుకున్న పార్టీల కన్ను యువ ఓటర్లపై పడింది. దీనికి అనుగుణంగా 18 నుంచి 30 వయసు కలిగిన వారిని గుర్తించడం వారిని పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేసేలా స్థానిక నేతలు దృష్టి సారించారు. నామినేషన్ల పర్వంలో భాగంగా నిర్వహించిన ర్యాలీలలో యువ ఓటర్లకే పార్టీలు ప్రాధాన్యతనివ్వగా... పార్టీలో వచ్చే అవకాశాలు, చేపడుతున్న సంక్షేమ పథకాలను వీరి ద్వారా ప్రచారం చేయించడంపై అన్ని పార్టీలు దృష్టి పెట్టాయి. ఒకప్పటి రాజకీయాలకు స్వస్తి పలుకుతున్నట్లుగా యువ ఓటర్లతో ప్రత్యేక సమావేశాలను స్థానికంగానే నిర్వహిస్తూ పార్టీ వైపు ఆకట్టుకుంటున్నాయి.

**కలిసి వచ్చిన ఉత్సవాలు...**

గ్రేటర్‌లో అట్టహాసంగా జరిగే వినాయక, దుర్గా నవరాత్రి ఉత్సవాలు పార్టీలకు బాగా కలిసి వచ్చాయి. స్థానికంగా ఏర్పాటు చేసే ఉత్సవ నిర్వాహకులను తమ వైపు ఆకట్టుకునేందుకు భారీ ఆఫర్లు ప్రకటించడంతోపాటు పార్టీ ప్రచార కార్యక్రమాలపై దృష్టి పెట్టాయి. ఇలా అంది వచ్చిన ప్రతీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్న పార్టీలు... యువ ఓటర్లకు అక్కున చేర్చుకుంటున్నాయి. మార్నింగ్ వాక్‌ల నుంచి ఈవినింగ్ చిట్‌చాట్‌ల వరకు అన్నింటికి తమ పార్టీ ముచ్చటే చర్చించేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దీంతో పోలింగ్ నాటికి ఇందులో 60 శాతం ఓట్లు పడినా... ఆపత్కాలంలో అండగా ఉంటుందని ప్రత్యర్థిని నియంత్రించవచ్చని స్థానిక జీతోనే యువ ఓటర్లపై ఫోకస్ చేసినట్లుగా తెలుస్తున్నది. ఇందుకు బస్తీలో ఉన్న యువతీయువకుల ఓటర్లు, లోకేషన్, మొబైల్ నంబర్ల వారీగా సమాచారాన్ని సేకరిస్తూ ప్రత్యేక గ్రూపులను రూపొందించి వారికి చేరువ అవుతున్నారు. ముఖ్యంగా సోషల్ మీడియాలోనూ ప్రత్యేక గ్రూపులను ఏర్పాటు చేసి విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించేలా గల్లీ నేతలు దృష్టి సారించారు.

## కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్‌లో

# బీసీ బిల్లు ప్రస్తావన ఏదీ?

- బీసీలకు కేవలం 20 సీట్లు మాత్రమే కేటాయించిన కాంగ్రెస్
- రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



సిటీబ్యూరో, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌లో బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పిస్తామనే అంశంపై ఎలాంటి ప్రస్తావన లేదని శనివారం విడుదల చేసిన లేఖలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. బీసీల డిక్లరేషన్ చేసిన కాంగ్రెస్ పార్టీ, ప్రస్తుత ఎన్నికల్లో బీసీలకు కేవలం 20 సీట్లు మాత్రమే కేటాయించిందని విమర్శించారు. కనీసం బీసీ డిక్లరేషన్‌లో రాజకీయ రిజర్వేషన్లు పెడితే ఆ పార్టీపై కొంత నమ్మకం ఏర్పడేదన్నారు. కాంగ్రెస్-బీజేపీలు బిల్లు పెట్టడానికి ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించి, ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

***బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు ప్రజాస్వామ్య హక్కు..***

దేశంలోని బీసీలందరూ బీసీలకు రాజ్యాధికారంలో వాటా కోరుతున్నారని, రాజకీయ రిజర్వేషన్లు ప్రజాస్వామ్య హక్కు అని అన్నారు. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పిస్తే పార్టీల నాయకుల ఆధిపత్యం తొలగిపోతుందన్నారు. ఎవరి దయాదాక్షిణ్యం పై ఆధారపడకుండా బీసీలకు 50శాతం చట్టసభల్లో టికెట్లు వస్తాయని పేర్కొన్నారు. లేకపోతే ప్రతి ఎన్నికల ముందు బీసీలు టికెట్ల కోసం ఉద్యమాలు, పోరాటాలు, సభలు పెట్టి ఒత్తిడి తేవాల్సి వస్తుందని ఆయన చెప్పారు. 76 ఏండ్లుగా బీసీలకు రాజకీయంగా అన్యాయం జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు ఉన్నప్పటికీ, చట్టసభల్లో మాత్రం బీసీల ప్రాతినిధ్యం 14శాతం దాటలేదన్నారు. బీసీలకు ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎంత అన్యాయం జరిగిందో తెలుస్తుందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీలకు రాజకీయ రిజర్వేషన్లు ఉన్నాయని, బీసీలకు పెట్టలేదని.. సామాజిక వర్గాలను విభజించి పాలిస్తున్నారని విమర్శించారు. బీసీలకు రాజకీయంగా అన్యాయం జరుగుతుందని గణాంకాలు తెలుపుతున్నాయని.. దేశంలో 16 రాష్ట్రాల నుంచి ఒక్క బీసీ పార్లమెంట్ సభ్యులు లేరని, లోక్ సభలో కేవలం 96 మంది మాత్రమే ఉన్నారని చెప్పారు. తెలంగాణలో కేవలం 22మంది ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారని, 129 బీసీకులాలుండగా 120 కులాల నుంచి ఇంతవరకు అసెంబ్లీ గడప తొక్కలేదన్నారు. ఇది ప్రజాస్వామ్యమా? లేక ధనస్వామ్యమా? అని ప్రశ్నించారు. దేశంలో బీసీలను బిచ్చగాళ్లను చేశారని తీవ్ర విమర్శలు చేశారు. మండల్ కమిషన్ 40 సిఫార్సులు చేస్తే కేవలం రెండు మాత్రమే అమలు చేశారని గుర్తు చేశారు. మిగతా 38 ఇప్పటికీ అమలుకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పాపమంతా 75 ఏండ్లు పాలించిన పాలకులదేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో 70కోట్ల మంది బీసీ కులాలను అభివృద్ధి చేయకపోతే ఈ దేశం అగ్రదేశంగా ఎలా రూపుదిద్దుకుంటుందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌లో పైన పేర్కొన్న అంశాలను పెట్టాలని డిమాండ్ చేశారు.

- పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్లు పెట్టాలి.
- బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి. అవసరమైతే రాజ్యాంగాన్ని సవరించాలి.
- బీసీల విద్య-ఉద్యోగ రిజర్వేషన్లపై ఉన్న క్రిమిలేయర్ విధానాన్ని తొలగించాలి.
- కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి రూ.2లక్షల కోట్లతో ప్రత్యేక అభివృద్ధి పథకం ప్రకటించాలి.
- హైకోర్టు-సుప్రీంకోర్టు జడ్జిల నియామకంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలి.
- ప్రైవేటు రంగంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలి.



ఖాదరగూడెంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్

## నీళ్లందించిన చరిత్ర

# బీఆర్ఎస్ ప్రభుత్వానిదే

- గ్యారెంటీ లేనోళ్లు వస్తున్నారు జాగ్రత్త.. మోసపోవద్దు
- మరోసారి ఆశీర్వదించాలి
- బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ రసమయి బాలకిషన్

మానకొండూర్ రూరల్, నవంబర్ 11: చెంజర్ల శివారు గ్రామాలైన నాటి ఖాదరగూడెం, నిజాయితీగూడెం, పెద్దూర్‌పల్లి, చెంజర్ల గ్రామాలకు ప్రభుత్వం ఖర్చు పెట్టి సాగు, తాగు నీరు అందించిన చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానిదే అని మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. గ్యారెంటీ లేనోళ్లు కాంగ్రెస్ పార్టీ వారు వస్తున్నారు వారితో జాగ్రత్తగా ఉండాలని, మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. మానకొండూర్ మండలంలోని ఖాదరగూడెం, నిజాయితీగూడెం, పెద్దూర్‌పల్లి గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాట్లాడుతూ 60 ఏండ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ అభివృద్ధి చేయని వారు ఇప్పుడు వచ్చి ఒక్క ఛాన్స్ ఇవ్వాలని ఏ ముఖం పెట్టుకుని వస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం జలాలతో ఖాదరగూడెం, నిజాయితీగూడెం, పెద్దూర్‌పల్లి గ్రామాల్లో నాడు తాగు నీటికే గొడవలైన చరిత్ర అని గుర్తు చేశారు. రైతులకు ఇచ్చే రైతు బంధుకు ఎకరాకు రూ. 10 వేలు, బీమా కింద రైతు మరణిస్తే రూ.5 లక్షలు ఇస్తున్నామని, దేశంలో ఎక్కడా లేని విధంగా ఇస్తున్నమన్నారు. త్వరలో తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ సన్న బియ్యం ఇస్తామన్నారు. ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల బీమా కల్పించనున్నట్లు తెలిపారు. మహిళల కోసం ముఖ్యంగా ఆడబిడ్డల కోసం కల్యాణ లక్ష్మి, షాదీముబారక్‌తో రూ.1,00,116 అందిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ హయాంలో ఒక్కరికి పింఛన్ వస్తే, వారు మరణిస్తేనే వేరే వారికి ఇచ్చేవారని, కేసీఆర్ సీఎం అయ్యాక వికలాంగులకు రూ. 4016, ఆసరా పింఛన్ రూ.2016 అందిస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో సీఎంగా ప్రమాణ స్వీకారం చేశాక వికలాంగులకు రూ.6016, ఆసరా పింఛన్‌ను రూ. 5016 పెంచి అందించనున్నట్లు మ్యానిఫెస్టోలో సైతం తెలియజేయడం జరిగిందన్నారు. కర్ణాటక రాష్ట్రంలో ఏడాది కాలంగా ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని, ఇప్పటికే 5 గంటల కరెంటు మాత్రమే ఇస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలు కాగానే ప్రతి దళిత కుటుంబానికి రూ. 10 లక్షల సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఖాదరగూడెంలో జిల్లెల్ల మల్లయ్య అనే వృద్ధుడిని ప్రత్యేకంగా పరామర్శించి పింఛన్ గురించి అడగగా సానుకూలంగా స్పందించారు. జీవీ రామకృష్ణారావు మాట్లాడుతూ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించే వ్యక్తి మన రసమయి బాలకిషన్ అన్నారు. కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని, వాళ్లు పాలించే కర్ణాటకలో సీఎం సీటు కోసమే ఇంకా నువ్వానేనా అని డజన్ మంది లైన్‌లో ఉన్నారని ఎద్దేవ చేశారు. కానీ మనకు సీఎంగా కేసీఆర్ మాత్రమే ఉన్నారని గుర్తు చేశారు. మరోసారి రసమయి బాలకిషన్‌కు ఆశీర్వదించి పట్టం కట్టాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్ గౌడ్, శంకరపట్నం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంట మహిపాల్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, గ్రామ శాఖ అధ్యక్షులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, బీఆర్ఎస్ నాయకులు, శ్రేణులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



పార్టీలో చేరుతున్న వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే, హాజరైన జనం